# గలగలా గోదారి

రాముడికి పెళ్ళయిందిరా అబ్బాయ్. దశరథ రాముడికి, ఆ అయోధ్యా రాముడికి సీతమ్మ తల్లితో పెళ్ళయిందిరా. నుదుట కళ్యాణ తిలకం కస్తూరి గుబాళింపులు వెదజల్లుతూవుండగా, సీతమ్మ తల్లి చెక్కిళ్ళ మీద ముద్ద మందారాలు విరబూస్తూవుండగా ఆ కుసుమించిన మందారాలు విడీ విడని రామచంద్రుడి పెదాల చిరునవ్వుల్తో పోటీ పడుతూవుండగా, సీతమ్మ తల్లి క్రీగంటి చూపుల్లో ఇంద్రనీలపు కాంతులు ప్రస్ఫుటిస్తూ వుండగా, వూరి వాళ్ళందరి గుండెల్లోని ఆనందం వాళ్ళ కనుకొలకుల్లో నిలిచిన ముత్యాల కాంతుల్లో బహిర్గతమవుతూవుండగా — ఆ సీతమ్మ తల్లికీ, ఆ రామయ్య తండ్రికి పెళ్ళయిందిరా. ఆ పుణ్య దంపతులు పోసుకున్న తలంబ్రాలు ఎరుపూ నీలం కాంతుల్లో వెలిగి పోతున్నాయిరా. ఆ విధంగా ఆ పుణ్య దంపతులు కొలువు తీర్చి వున్నార్రా అబ్బాయ్. సభ తీర్చిన వూరు వూరంతటినీ చిరునవ్వులే ఆశీర్వచనాలుగా చూస్తూ వున్నారురా. నీల మేఘశ్యాముణ్ణి ఓరకంట చూస్తున్న సీతమ్మ తల్లి చూపు, కొంచెం దూరంగా అంజలి ఘటించి అంతర్ముఖుడైన శంకరం మేస్టారి మీద పడిందిరా. సీతమ్మ తల్లి చూపుని గమనించిన ఆ రామచంద్రుడు సాదరంగా నవ్వాడురా. కురుస్తున్న ఆ అమృత ధారల్ని తనివి తీరా దోసిళ్ళతో తాగుతున్నార్రా శంకరం మేస్టారు.

సభంతా నిశ్శబ్ద చైతన్యం.

ముందు వరసలో కూచున్న పెద్దల కేసి చూసాడు పూజారి. అంత కంటేనా అన్నట్టుగా తిరిగి చూసిన వారి చూపునందుకుని, మేస్టారి వెనక నిలబడ్డ రామదండు కేసి చూసాడురా అబ్బాయ్. ఆ చూపునందుకున్న రామబంటు లిద్దరు రెండు గంతుల్లో పందిరిదాటి, మరో రెండు గంతుల్లో తిరిగి మేస్టారి ముందువాల్రా. వాళ్ళ చేతుల్లో అతి పదిలంగా పట్టు కున్న తులసీ రామాయణం, మేస్టారి ప్రాణం. అది చూసి సభ యావత్తు, 'సాహో' అంది ఓంకారనాదంలా. కళ్ళు తెరిచిన మేస్టారి ఎదురుగా దోసిలొగ్గి నిలబడ్డ పూజారి, భక్తిని తప్ప మరొకటి ప్రకటించని చేతుల మధ్య వెలుగుతున్న తులసీ రామయణం కనిపించాయి. ఆ పుస్తకానికి నమస్కరించి అందుకుంటూ, సభకేసి చూసార్రా మేస్టారు. 'మీదే ఆలస్యం' అన్నట్టుగా వున్నాయిరా వాళ్ళ చూపులు.

"ఇప్పటికే చాలా ఆలశ్యమయింది. భోజనాలయ్యాక కూచుంటే బావుంటుందేమో" అన్నార్రా మేస్టారు.

"అదేటండీ, తవరు అమృతం పెడతానంటే భోజనాలెవరిక్కావాలండీ, ఏవంటార్రా" అన్నాడ్రా అబ్బాయ్ పెదకాపు నాగన్న.

"మరేనండి. ఆకలేటండి ఆకలి. అన్నంతో తీరే ఆకలి కాదండిది." అన్నాడు సేనాపతుల రామన్న.

"మీరు కానివ్వండి మేస్టారు. ఈ తొమ్మిది రోజులు, ఈ ఆనందం కోసనే ఆగావండి." అన్నాడ్రా మూర్తి రాజు.

యథాలాపంగా కూచున్న వాళ్ళుకూడా బాసీపట్టు బిగించార్రా అబ్బాయ్.

వేదిక మీదున్న పుణ్యదంపతులకి నమస్కరించి, తులసీ రామాయణాన్ని కళ్ళకద్దుకున్నార్రా మేస్టారు.

శంకరం మేస్టారంటే, ఆయన ఏ స్కూల్లోనూ మేస్టరుకాదురా అబ్బాయ్. ఆయన పాండిత్యాన్ని కొలవడానికి డిగ్రీలూ లేవు. మెచ్చుకోళ్ళు, బిరుదులూ లేవు. వాల్మీకికి డిగ్రీలే వున్నాయిరా. పోతనకేమున్నాయ్ చెప్పు. పెద్దల నుంచి అనూచానంగా వస్తున్న సంస్కారం, చుట్టూవున్న ప్రపంచం, నేర్చుకోవాలనే తితీక్ష మేస్టారికి పాండిత్యాన్నిచ్చాయిరా. అచంచలమైన రామభక్తి పది మందిలోనూ ఆయునని అందరికన్నా ఎత్తుగా నిల బెట్టేందిరా అబ్బాయ్.

ఆ వూరి కుర్ర కారందరికీ ఆయన మేస్టారే. పెద్దలకి కూడా ఆయన మేస్టారేరా.

పెద్దల నుంచి సంక్రమించిన మడిచెక్కానీ, ఆ రామచంద్రుణ్ణీ నమ్ముకున్నార్రా ఆయన.

ఆయన గొంతు మృగేంద్ర గర్జనలా వుంటుంది. పోతన భాగవతం, తులసీ దాసు రామాయణం, దాశరథి శతకం, ఆయన కత్యంత ప్రీతిపాత్రమైనవి.

తులసీ రామాయణం చదివే విధానం, దాని అంత రంగపు లోతులు తెలుసుకోవాలని, ఉత్తర హిందు స్థానం వెళ్ళి అక్కడి వాళ్ళతో వుండి ఆ వ్రజ భాష మెళ కువలు నేర్చుకున్నార్రా ఆయన.

పోతన భాగవతాన్ని ఆమూలాగ్రం చదివి, ఆ సహజ కవి కవితా సౌందర్యాన్ని ఆ పోశవపట్టార్రా ఆ సహజ పండితుల్ను.

## రాజేంద్రుడెవ్వడు?

ఆయన పద్యం చదువుతూవుంటే ఒళ్ళు పుల రిస్తుంది. వివరణ చెపుతూ వుంటే పాషండుడికి కూడ పరమార్థం ఒంటపడుతుంది.

ము:ప మాపు వేళకి ఆ వూరి కుర్రకారంత మేస్టారింటికి బారులు తీయడం నిత్యకృత్యం. అన్నా తిని కడిగిన చేతులు కూడా ఎండకుండా మేస్టారింటి



# రాక్షసక్రీడ

ఈరాత్రి వెక్కిరిస్తోంది... ఈ శిథిలాలు నేను సిగ్గు పడేట్టుగా ప్రశ్నిస్తున్నాయి
వేల వేల సంవత్సరాలుగా ఈ నేలపై దారులు వేసిన దివ్యపాదాలు
కదలలేని నా కాళ్ళపై సవాళ్ళు విసురుతున్నాయి
మనసు నిండా తుఫాను... బీభత్సం... ప్రళయం
చంద్రుడు ముక్కలై అశ్లీలమైన వెన్నెల తడుపుతున్న ఈ రోడ్లపై
ఆకాశం విరిగి... చిట్లి... బద్దలై కుండపోతగా కురిసే అశాంతి
పరుగు... పరుగు... పరుగు-
ఎవరూ తరుమడం లేదు... ఎవరూ వేటాడడం లేదు
సిగ్గుపడే ఆత్మ వ్యక్తిత్వాన్ని ప్రశ్నించి 'వధ' చేస్తోంది
అన్నం లేకుంటే బతుకుతాను, నీరు లేకున్నా గాలి లేకున్నా ఫర్వాలేదు
......బతుకుతాను
కాని వ్యక్తిత్వం చచ్చి, జాతీయత చచ్చి, దేశీయత చచ్చి ఒట్టి నీకోసం నీవు-ప్
ఎందుకీ బతుకు-
హంతకులకు సన్మానాలు... తల్లి స్తనాలకు ఉయలగట్టి ఊగడాలు
మేధావులు భవనాల్లో నిద్రపోవడాలు
వీధుల్లో మొరిగే కుక్కలకు భయపడి కోట్ల జనం పారిపోవడాలు...
దేశం గుండెలమీద శిలువపై మేకుల్లా గునపాలు దిగుతున్నాయి
రన్ ఆన్... లేక రన్ ఔట్... బతుకో చావో ఏదో ఒకటి
కాని జీవచ్ఛవపు జీవితమొద్దు
'తినేది మగవి సొమ్ము, పాడేది మండెల పాట'- వద్దు
అటు తుపాకీ కాల్పులు
ఇటు హత్యాపథకాలు - గొడ్డళ్ళతో చంపుకోవడాలు
నడిరోడ్డుపై ఈ దేశం యిచ్చిన
పరమ పవిత్రమైన 'స్వేచ్ఛ'ను విశృంఖలత్వంగా మార్చే
రాక్షసక్రీడకు ముగింపు - ముగింపు కావాలి
తప్పు చేసినవాడు కొడుకైనా సరే దొంగనా కొడుకైనా సరే
చెంప పగలగొట్టి బుద్ధి చెప్పక తప్పదు
మనది బంగారమైనా సరే నిప్పుతో శుద్ధి చేయక తప్పదు
వెక్కిరించే ఈ కలతరాత్రిని
ఓ నిరవి ఉదయంతో జయించడం తప్పదు—

—రామా చంద్రమౌళి

పరుగే. దీపాలు పెట్టిన ఓ ఘడియకు పనులు తెముల్చుకుని వయసు మళ్ళిన వాళ్ళు చేరటంరివాజు. మరో ఘడియకి పొలంలో పగలంతా పడ్డశ్రమని వేన్నీళ్ళతో కడిగేసుకుని, ఉడుకుదుకున్నంలో కలిగింది నంజుకుని బ్రేవ్‌మని త్రేనుస్తూ కొందరు రైతులు, పాలేళ్ళు మొదలైన వాళ్ళుకూడా మేష్టారింటికి జేరడం మామూలే. అలా సభ నిండగానే, మేష్టారి ముందు హరికేన్ లాంతర్, భాగవతమో— తులసీ రామాయణమో పట్టుకొచ్చి పెడితే, ఆయన అలా చదువుతూ వుంటే కాలం ఆగి పోయేదిరా అబ్బాయ్.

ఆయన చిన్ని కృష్ణుడి లీలలు చదువుతూ వుంటే అక్కడున్న వారంతా చిన్ని కృష్ణుళ్ళయిపోయేవారురా. రుక్మిణీ కళ్యాణంలో రుక్మిణి పంపిన రాయబారం వింటున్నప్పుడు, రాయబారానికి వెళ్ళిన విప్రుళ్ళయి పోయే వారందరూ. కంసవధ వర్ణిస్తూ వుంటే అందరూ బుసలు కొట్టేవారు. ప్రహ్లాద చరిత్ర చదువుతూ వుంటే హిరణ్యకశిపుడి మీద విరుచుకు పడే వారందరూ. గజేంద్రమోక్షం వివరిస్తూ వుంటే 'లావొక్కింతయు లేదు' అంటూ ఆర్తనాదాలు చేసే వారు. అలా సాగి పోయేదిరా ప్రతిరోజూ.

అవన్నీ ఒక ఎత్తు. ఆయన చదివే తులసీ రామాయణం ఒక ఎత్తు. ఎత్తైన కొండల మీంచి దూకుతున్న జలపాతంలా, సన్నగా సాగిపోయే సెలయేరులా, నిండు గోదావరిలా ఆ సన్నివేశానికనుగుణంగా ఆయన గొంతు మూర్ఛనలు పోయేదిరా. ఆ ప్రవాహంలో అందరూ కొట్టుకుపోయేవారు. కాలమెక్కడ ఆగిందో, చుక్క ఎప్పుడు పొడిచిందో ఎవరికీ తెలిసేది కాదు. అందరికీ తెలిసేది ఒక్కటేరా అబ్బాయ్. సంతతధారగా కురిసిన ఆనందామృతం తాలూకు అనుభూతి. ఆ చోటంతా, అక్కడ జేరిన జనమంతా రామనామంలో తడిసి, రామనామాన్ని ప్రతిధ్వనించేది.

అందుకనే, ఆనాడు, ఆ సీతారాముల కళ్యాణ ఘట్టం పూర్తయిన నాడు, వూరంతా ఒక్కటై ఆ తులసీ రామాయణాన్ని వినిపించమని కోరింది.

నవదంపతులై కొలువున్న సీతారాములకి నమస్కరించి, హనుమంతుడ్ని మనసారా ధ్యానించి, ఆ తులసీ రామాయణాన్ని కళ్ళకద్దుకుని, ఆనందం, భక్తీ కళ్ళల్లో పోటీ పడుతూవుండగా పుస్తకం తెరిచార్రా అబ్బాయ్ శంకరం మేష్టారు. సుందరాకాండ తెరుచుకుంది. మేష్టారి గుండె పొంగింది.

ఈ లోపున భూపతిరాజు లేచి నిలబడి, 'మేష్టారూ', అని పిలిచాడ్రా.

సభంతా అపస్వరం విన్నట్టుగా వులిక్కిపడిందిరా అబ్బాయ్

'ఏమిట'న్నట్టు చూసార్రా మేష్టారు.

'మరండి, మన మందరం పెద్ద రాజు గారి తోటలో సమావేశమయితే బాగుంటుందనుకుంటానండి. వారు కూడా వింటానికవకాశముంటుందండి. ఎంతైనా పెదరాజుగారు కదండి' అన్నాడ్రా.

సభంతా చల్లబడి పోయిందిరా అబ్బాయ్. రామదండు కూడా నిశ్చలమయిపోయింది.

పెద్దరాజుగారూ చాలా వున్నతమయిన మనిషిరా. ఆయనంటే వూరంతటికీ గౌరవమే. మేష్టారంటే ఆయనకీ, ఆయనంటే మేష్టారికీ కూడా గౌరవమేరా అబ్బాయ్. ఆయన తోట విడిచి ఎక్కడికీ కదలరు. అయినా, ఏ పనికైనా ఆయన ఆమోదం తీసుకోవడం ఆ వూరి రివాజు. పైగా ఆ రామకళ్యాణానికయిన ఖర్చులో ఎక్కువ భాగం ఆయనే భరించారు. అదీ గాక, శంకరం మేష్టారు వినిపించే తులసీ రామాయణం అంటే ఆయనకి విపరీతమైన మక్కువ. ఎన్నోసారులు బండి పంపించి మేష్టార్ని పిలిపించుకుని, ఆయన్ని విని, ఆనందంతో పులకరించిపోయిన విషయం వూరంతటికీ తెలుసు. సత్కారాలన్నా, మెచ్చుకోళ్ళన్నా మేష్టారికి కిట్టదనీ తెలుసు.

అడిగింది రాజుగారి అల్లుడాయె. అందులోనూ వూరంతా అభిమానించి గౌరవించే పెద్దరాజుగారి కోసమాయె.

సభంతా వుత్కంఠతతో వుందిరా అబ్బాయ్. ఆ రామయ్య తండ్రీ సీతమ్మ తల్లీ కూడా వుగ్గబట్టుకుని వున్నార్రా అబ్బాయ్.

మేష్టారు చిన్నగా నవ్వారురా అబ్బాయ్. నవ్వీబాబూ, రాజులకి రాజు, రాజేంద్రుడు అయిన ఆ శ్రీ రామ చంద్రుడి సమక్షంలో రామాయణం గానం చేస్తానని సంకల్పం చెప్పకొన్నాను. అందుకని, ఇప్పుడు కదిలే ప్రసక్తిలేదు. పెద్దరాజుగారికి విడిగా, ఆయనకి ఆనందం కలిగేటంత వరకూ వినిపిస్తాను. ప్రస్తుతం నన్ను క్షమించండి' అన్నార్రా.

'శ్రీ రామచంద్రుడికీ జై' అని ఒక్క కంఠంతో జేజేలు పలికిందిరా సభంతా.

ఆ సంగతి తెలిసిన పెద్ద రాజుగారు, 'అడేటలాటి పని చేసారు. ఛ! ఛ! అటువంటి తెలివి తక్కువ ప్రసంగం తవరెప్పుడూ చెయ్యకండి పరువుతక్కువ. అన్నార్రా అల్లుడితో.

అదిరా అబ్బాయ్. ఆ రోజు వూరంతా, ఆ రామ చంద్రుడితో పాటు ఆనందంగా ఆ రామాయణ గానాన్ని విందిరా.